మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

ఆరోపణలు కాదు.. బాధ్యులపై చర్యలు తీసుకో

- దమ్ముంటే అవినీతిపై ప్రభుత్వానికి లేఖ రాయి
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందే
- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, జూన్ 22: నగరపాలక సంస్థ అవినీతిమయమైందని పదేపదే ఆరోపించడం కాదని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. దమ్ముంటే విచారణకు సిట్ ఏర్పాటుతో పాటు పాలక వర్గాన్ని రద్దు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాయాలన్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరాభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ రివ్యూను స్వాగతిస్తున్నామని, కానీ అందులో ఆయన చాలా విషయాలను మరిచి పోయారని విమర్శించారు. స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా వన్ టౌన్ ఎదుట తొలగించిన తెలంగాణ తల్లి, మాజీ ఎంపీ చొక్కారావు విగ్రహాలను నేటికీ ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఈ విగ్రహాల ఏర్పాటు విషయంలో అధికారులు మంత్రిని తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. తొలగించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్కడ దాచిపెట్టారో ఇప్పటి దొరకడం లేదన్నారు. ఇటీవల సమీక్షలో చొక్కారావు విగ్రహం ఒక్కటే అక్కడ పెట్టాలని మంత్రి చెప్పినట్టు తాము విన్నామన్నారు. ఈ చొరస్తాలో చొక్కారావు విగ్రహంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమకారులందరం కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా బొమ్మకల్ జంక్షన్ అభివృద్ధికి నిర్ణయం తీసుకున్న మున్సిపల్ అధికారులు, కమిషనర్, కన్సల్టెన్సీ ఎండీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. నగరపాలక సంస్థలో లేని బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధిలో స్మార్ట్ సిటీ నిధులు చట్టవిరుద్ధంగా ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి జరిగిందని ఎంపీ బండి సంజయ్ గతంలోనే కేంద్రమంత్రికి ఫిర్యాదు చేశారని, మరి మేయర్ ఎందుకు అలా మాట్లాడారో తనకు తెలియదన్నారు. స్మార్ట్‌సిటీ తేవడంలో సంజయ్ పాత్ర ఏమాత్రం లేదని, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ కృషి వల్లే వచ్చిందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు జక్కం నర్సయ్య, పెండ్యాల మహేశ్‌కుమార్, గుంజపడుగు హరిప్రసాద్, రాములు, కెమసారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

కార్పొరేషన్, జూన్ 22: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో అదనపు కలెక్టర్‌తో పాటుగా ఆర్‌డీవో, అర్బన్ తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ డీసీపీ, ఏసీపీ, సూపర్‌వైజర్లు ఉంటారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనిలో వచ్చిన ఫిర్యాదులను టౌన్ ప్లానింగ్ విభాగానికి పంపిస్తే వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఫిర్యాదులు అందితే ప్రతి శుక్రవారం వాటిని విధిగా పరిశీలిస్తారని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణ ప్రత్యేక కౌంటర్ సోమవారం నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు.

ప్రైవేట్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం

పేషెంట్లకు తప్పిన ప్రాణాపాయం

రాంనగర్, జూన్ 22: నగరంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో గల ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. హాస్పిటల్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడం, ఫైర్ సిబ్బంది సకాలంలో రావడంతో ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదు. సుభాష్‌నగర్ చౌరస్తా సమీపంలో గాయత్రి హాస్పిటల్ రెండో ఫ్లోర్‌లో ఏసీ కాంప్రెషర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ ఏసీలన్ని ఐసీయూలో ఉండడంతో మంటలు త్వరగా వ్యాపించాయి. హాస్పిటల్ యాజమాన్యం అప్రమత్తమై పేషెంట్లను బయటికి తరలించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సకాలంలో అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో పాటు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

ఇన్‌చార్జి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా?

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్

- జిల్లా సమస్యలపై ఆరు నెలల్లో ఒక్క సమీక్ష అయినా జరిపారా?
- స్మార్ట్‌సిటీలో బండి సంజయ్ భాగస్వామ్యం లేదు
- ఇప్పటికైనా కేంద్ర మంత్రిగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, జూన్ 22: జిల్లాకు సంబంధించిన సమస్యలను ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవడం లేదని, అసలు ఆయన ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నట్టా.. లేనట్టా? అని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ నిలదీశారు. శనివారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సమస్యలు పరిష్కరించడంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు జిల్లా సమస్యలపై ఒక్కసారి కూడా సమీక్ష చేయలేదని ఆరోపించారు. వేసవి కాలంలో తాగు, సాగునీటి సమస్యలు ఎదురైనా పట్టించుకోలేదని, ప్రస్తుతం వర్షకాలం ప్రారంభమవుతున్నదని, దీంతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానల్లో పరిస్థితులు, ఇతర వ్యవస్థలపై కనీసం సమీక్ష కూడా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తామని స్వీకరించిన దరఖాస్తులు బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆపారని, వీటిని వెంటనే ప్రారంభించేలా చూడాలన్నారు. ఇప్పటికైనా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ ప్రాంత సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై రెండు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని కోరారు. కరీంనగర్‌కు 'స్మార్ట్‌సిటీ' ఘనత అప్పటి సీఎం కేసీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కే దక్కుతుందని, ఇందులో మరొకరి భాగస్వామ్యం లేదని తేల్చి చెప్పారు. తోటి కార్పొరేటర్ బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంపై బీఆర్ఎస్ నుంచి శుభాకాంక్షలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఎప్పుడూ అభివృద్ధి గురించి సంజయ్ పట్టించుకోలేదన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర సహాయ మంత్రిగా నియోజకవర్గం, నగరాభివృద్ధికి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కరీంనగర్ టు హసన్‌పర్తి రైల్వే లైన్ తీసుకురావాలని, కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ, పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈఎస్ఐ హాస్పిటల్స్ ఏర్పాటు చేయించాలని కోరారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని నాలుగు జిల్లాలకు నవోదయ విద్యాలయాలను తీసుకురావాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 18 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వారిలో ఒక్క శాతం ఓటర్లు 18 వేల మందికి ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలను తీసుకురావాలని కోరారు. నత్తనడకన సాగుతున్న తీగలగుట్టపల్లి ఆర్‌వోబీ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రతిరోజూ రైలును నడిపించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీజేపీ గత ప్రభుత్వం అని విమర్శలు చేయడం మానుకొని ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. 29 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు గంగుల కమలాకర్ వెంటే ఉంటారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు ఆరె రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, సత్తినేని శ్రీనివాస్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోల్‌క్లైంబింగ్ టెస్ట్‌కు ఆరుగురు అభ్యర్థులు హాజరు

ముకరంపుర, జూన్ 22: విద్యుత్ సంస్థలో జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ కోసం శనివారం నిర్వహించిన పోల్ క్లైంబింగ్ టెస్ట్‌కు ఆరుగురు అభ్యర్థులు హాజరయ్యారు. ఏడో విడుతలో అధికారులు మొత్తం ఏడుగురు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించగా ఒకరు గైర్హాజరయ్యారని ఎంపిక కమిటీ ఛైర్మన్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. అబ్జర్వర్ ఎన్పీడీసీఎల్ సీజీఎం(హెచ్ఆర్డీ) మధుసూదన్ జేఎల్ఎంల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. కన్వీనర్(పీవో) బీ చంద్రయ్య, మెంబర్లు మంథని డీఈ ఈశ్వర్ ప్రసాద్, డీఈ(టెక్నికల్)విజయేందర్ రెడ్డి ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

గంగాధర, జూన్ 22 : బూరుగుపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖీ సమావేశం నిర్వహించి వారి ప్రతిభను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలోని సౌకర్యాలు, సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల వైద్య శిబిరానికి స్పందన

సీజీఎం(హెచ్ ఆర్డీ) మధుసూదన్‌కు నేత్ర పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

ముకరంపుర/ విద్యానగర్, జూన్ 22: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం విద్యుత్ ఉద్యోగులకు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. సీజీఎం (హెచ్ఆర్డీ) మధుసూదన్, ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు రామనాథ్ ప్రతిష్టా రావు, నాగరాజు, వేణుగోపాల్, సిబ్బంది 230 మంది ఉద్యోగులకు బీపీ, షుగర్ టూడీ ఎకో, ఈసీజీ, ఇతర పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులకు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల జబ్బులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించాలన్న లక్ష్యంతోనే వైద్య శిబిరం నిర్వహించామన్నారు.

నేత్ర పరీక్షలు

వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు అజయ్, వంశీ, రజనీ, తదితరులు 186మంది విద్యుత్ ఉద్యోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు.

15మంది ఉద్యోగుల రక్తదానం

తలసేమియాతో బాధపడుతున్న వారికోసం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డీఈలు జే రాజం, ఎం తిరుపతితో పాటు మరో 15మంది విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు పెండ్యాల కేశవరెడ్డి, చిదుర సురేశ్, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ బొమ్మిడి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నగర ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు కలెక్టర్

కార్పొరేషన్, జూన్ 22: కరీంనగర్ నగరపాలక సంస్థ కమిషనర్‌గా అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ శనివారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బల్దియాలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశమై, అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సోహన్‌సింగ్‌కు మేయర్ లీగల్ నోటీసులు

కార్పొరేషన్, జూన్ 22: కొంత కాలంగా 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్ జిత్ కౌర్ భర్త సోహన్ సింగ్ ఉద్దేశపూర్వకంగా తనపై ఆరోపణలు చేస్తున్నారని శనివారం హైకోర్టు నుంచి లీగల్ నోటీసులు జారీ చేసినట్లు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మీడియా సమావేశాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తూ తన గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగుల ఆధార్ నమోదు తప్పనిసరి

కలెక్టరేట్, జూన్ 22 : జిల్లాలోని డ్రాయింగ్, డిస్బర్స్‌మెంట్ అధికారులు తమ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆధార్ నంబర్‌ను విధిగా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కోశాగార డిప్యూటీ డైరెక్టర్ ఎం.నాగరాజు సూచించారు. జూన్ నెల వేతనాల జాబితా సిద్ధం చేయడానికి ముందే ఆధార్ నంబర్ ఇంటిగ్రెటెడ్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం పోర్టల్‌లో నమోదు చేసి పంపాలని, ఇప్పటికే నమోదు చేస్తే సరిచూసుకోవాలని పేర్కొన్నారు. వేతనాల విడుదల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులు పరిష్కరించే క్రమంలో, డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు డ్రాయింగ్ అధికారులు ఈనెల 25లోగా ఐఎఫ్ఎంఐఎస్ సిస్టంకు అనుగుణంగా నమోదు చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

చెంచు మహిళ పై దాడి అమానుషం

కలెక్టరేట్, జూన్ 22 : భూ తగాదాలో చెంచు మహిళపై దాడి చేయడం అమానుషమని తెలంగాణ మహిళా చైతన్య సంఘం జిల్లా అధ్యక్షురాలు బొల్లబత్తిని రాధ అన్నారు. శనివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన ఈ అనాగరిక చర్య రాష్ట్రంలో మహిళలకు ఉన్న అభద్రతను తేటతెల్లం చేస్తున్నదని పేర్కొన్నారు. బాధిత మహిళ ఈశ్వరమ్మకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా నాయకురాళ్లు వర లక్ష్మి, నాగమణి, మౌనిక, ఆశమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

తెలంగాణచౌక్, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి వినయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని కోతిరాంపూర్‌లో గల ప్రభుత్వ పాఠశాలను శనివారం నగర కమిటీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఇక్కడ నగర కమిటీ సభ్యులు రాకేశ్, చరణ్ ఉన్నారు.

'బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు'

తెలంగాణచౌక్, జూన్ 22: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత, గిరిజన ఆదివాసులు, దళితులపై దాడులు పెరుగుతున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ ఆరోపించారు. నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్తర తెలంగాణ సామాజిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన పెరియార్, పూలే అంబేద్కర్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దినకర్, నాయకులు కనకరాజు, ప్రవీణ్, రాజు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన యాదవ సంఘం నాయకులు

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తెలంగాణచౌక్, జూన్ 22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను నగరంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి జంగా కొమురయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు పాశం తిరుపతియాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల సమస్యల గురించి విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. ఇక్కడ కరీంనగర్ రూరల్ మండల నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమేశ్ యాదవ్ ఉన్నారు.

'ఎంపీ ఎన్నికల్లో ఓటమి బాధ్యత మంత్రి పొన్నందే'

తెలంగాణచౌక్, జూన్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు ఓటమికి మంత్రి పొన్నం ప్రభాకర్ నైతిక బాధ్యత వహించాలని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో ఫ్రంట్ సభ్యులు శ్రీధర్, రవీందర్, బాపురెడ్డి, రాంరెడ్డి, నరేందర్‌తో కలిసి శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో సివిల్ కాంట్రాక్టర్ వెలిచాల రాజేందర్‌రావుకు పట్టుబట్టి టికెట్ ఇప్పించిన పొన్నం ప్రభాకర్ ఆయనను ఎందుకు గెలిపించలేక పోయారని ప్రశ్నించారు. టికెట్ ప్రవీణ్‌రెడ్డికి ఇస్తే సమీకరణ మారి కాంగ్రెస్ పార్టీ గెలిచేదన్నారు. కరీంనగర్ ఎంపీ స్థానంలో ఓడిపోవడానికి గల కారణాలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించిన కమిటీకి లేఖ ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం

చిగురుమామిడి, జూన్ 22: ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్, చిట్టిమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ మహిళా మండలాధ్యక్షురాలు పోలు స్వప్న, బోయిని వంశీకృష్ణ, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

గంగాధర, జూన్ 22 : ఎలాంటి నిబంధనలు లేకుండా రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని గంగాధర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీ కడుతున్న వారికి, రేషన్ కార్డు లేని రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు.

దొంగను పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ సెక్యూరిటీ

తెలంగాణచౌక్, జూన్ 22: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం దొంగతనానికి పాల్పడుతున్న జ్యోతి అనే మహిళను పట్టుకున్నట్లు ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ బావ్‌రావు, ఎస్ఐ సురేందర్ తెలిపారు. అనూష, సరళ అనే ప్రయాణికుల నుంచి ఏటీఎం కార్డు, నగదు దొంగలించి పారిపోతుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని సెక్యూరిటీ అధికారులకు అప్పగించారు. దొంగతనానికి పాల్పడిన జ్యోతి నుంచి ఏటీఎం, డబ్బులను స్వాధీనం చేసుకొని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఏఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ రమణ, ఔట్ సోర్సింగ్ గార్డు కవిత పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

హుజూరాబాద్ రూరల్, జూన్22: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ కొలుగూరి సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యతగా కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు సమావేశంలో ఏఐఎస్‌బీ నాయకులు కుక్కముడి రాజేశ్, దుర్గం బాలు, నాయిని జనార్దన్, ఉట్ల ప్రతీక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అటవీ భూముల కోసం సర్వే

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ అధికారులు

కరీంనగర్‌రూరల్, జూన్ 22: అటవీశాఖ భూముల నుంచి జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టారని అటవీశాఖ అధికారుల ఫిర్యాదు చేయగా, స్పందించిన కలెక్టర్ సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో శనివారం ఇరుకుల్ల శివారులోని సమ్మక్క గద్దెల ప్రాంతంలో అటవీశాఖ అధికారుల సమక్షంలో రెవెన్యూ, హైవే అథారిటీ అధికారులు సర్వేచేపట్టారు. సర్వే నంబర్లు 98, 100లో నేషనల్ హైవేకు కేటాయించిన 17.34 గుంటల స్థలంలో సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేమియానాయక్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. భూములను పరిశీలించారు. అయితే మరోసారి క్షుణ్ణంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని డీఐ వెల్లడించారు. ఇందులో కరీంనగర్ రూరల్ తహసీల్దార్ నవీన్‌కుమార్. ఆర్ఐ వాస్తవీక్, సర్వేయర్ సంతోష్, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మండల స్థాయి క్రీడాపాఠశాల ఎంపిక పోటీలు

మానకొండూర్/చిగురుమామిడి/ తిమ్మాపూర్/ గన్నేరువరం/ చొప్పదండి, జూన్ 22: క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వివిధ మండల విద్యాధికారులు తెలిపారు. ఈ నెల 25, 26న మానకొండూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో, 24, 25 తేదీల్లో చిగురుమామిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో, 26న తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 25న గన్నేరువరం మండలం జంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చొప్పదండి జిల్లాపరిషత్ బాలుర పాఠశాల క్రీడామైదానంలో పోటీలు జరుగుతాయని ఆయా మండలాల మండల విద్యాధికారులు విద్యాధికారి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, ఎం మధుసూదనాచారి, కే శ్రీనివాస్ రెడ్డి, వేణుకుమార్, శ్రీనివాసరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 1-09-2015 నుంచి 31-08-2016 మధ్య జన్మించి, ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న బాల, బాలికలు ఈపోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, గత సంవత్సరం మార్కుల జాబితా, డేట్ ఆఫ్‌బర్త్ సర్టిఫికెట్స్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఎంపిక పోటీలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎల్లమ్మ బోనాల జాతరకు హాజరైన ఎమ్మెల్యే

హుజూరాబాద్ రూరల్, జూన్ 22: కనుకులగిద్ద గ్రామంలో శనివారం రేణుకా ఎల్లమ్మ బోనాల జాతరకు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి-శాలిని దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

గంగాధర, జూన్ 22 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి మృతి చెందగా, ఆయనను శనివారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ మండల నాయకులు హైదరాబాద్‌లో కలిసి పరామర్శించారు. రూపాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇక్కడ మార్క